క్లుప్తంగా

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ రవినాయక్

పెగడపల్లి:మండలంలోని ఏడుమోటలపల్లిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ ఇస్లావత్ రవినాయక్ ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను కోరారు. గ్రామంలో ప్రధాన రహదారిపై లోలెవల్ కల్వర్టు అస్తవ్యస్తంగా ఉందని దీన్ని ఆధునీకరించాలని, యాపల్ చెరువు వద్ద నిర్మించిన వంతెన అసంపూర్తిగా ఉందని పేర్కొంటూ ఈ రెండు పనులను పూర్తి చేయించాలని సోమవారం వినతిపత్రం అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు నంది మల్లారెడ్డి, నాయకులు తిరుపతి, మల్లేశం, రాజేందర్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక డంపులు స్వాధీనం



ఇసుక డంపు వద్ద అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట శివారులో వరదకాల్వ వద్ద ఇసుక డంపులను పోలీస్,రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వరదకాల్వలో ఇసుక దిబ్బలు ఏర్పడి మోటర్ల ద్వారా సాగు నీరు సక్రమంగా అందకపోవడంతో గత కొద్దిరోజుల క్రితం రైతుల విజ్ఞప్తి మేరకు ఇరిగేషన్ అధికారులు ఇసుకను బయటకు తీయించి వరదకాల్వ కట్టపై పోయించారు. ఈ ఇసుకను రెవెన్యూ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. కాల్వలో నుంచి తీసిన ఇసుక ఎంత ఉంటుందో అంచనా వేసి వేలం వేస్తామని తహసీల్దార్ శేఖర్ తెలిపారు.

ఇంగ్లిష్ సబ్జెక్ట్‌పై మండల స్థాయి పోటీలు



బహుమతులు అందిస్తున్న ఎంఈవో

కథలాపూర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ మండల శాఖ ఆధ్వర్యంలో కథలాపూర్‌లో విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై మండల స్థాయి పోటీలు సోమవారం నిర్వహించారు. స్పెల్ విజార్డ్, డ్రామా విభాగాల్లో పోటీ పరీక్షలు జరిగాయి. ఇందులో కస్తూర్బా బాలికల విద్యాలయానికి చెందిన మధుహాసిని, పోతారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన శైలజ విజేతలుగా నిలిచారు. వీరికి బహుమతులు అందించి అభినందించారు. జిల్లా స్థాయి పోటీలకు ఈ విద్యార్థులను పంపిస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, మండల కన్వీనర్ నల్ల సంజీవ్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటేశం, దరందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆంగ్ల పరిజ్ఞానం పెంపొందించాలి

మెట్‌పల్లి: విద్యార్థుల్లో ఆంగ్ల పరిజ్ఞానం పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈవో భీమయ్య అన్నారు. పట్టణంలోని బంటుపేట ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. వీటిల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టవర్ నిర్మాణం నిలిపివేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

రాయికల్: పట్టణంలోని 9వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని సోమవారం కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రేడియేషన్‌తో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిపివేయని పక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మహిపాల్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్మాణమేది?

- బస్‌షెల్టర్ల నిర్మాణంలో అలసత్వం
- కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఐదు ప్రాంతాలు ఎంపిక
- ఐదేళ్ల క్రితమే రూ.15 లక్షలు మంజూరు
- స్థలాలు గుర్తించడంలో జాప్యం



బస్‌షెల్టర్ లేక రోడ్డుపై నిల్చున్న ప్రయాణికులు

మెట్‌పల్లి: నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో బస్సులు నిలిపే ప్రధాన కూడళ్లలో షెల్టర్ల ఏర్పాటుకు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే నిధులను మంజూరు చేసింది. కానీ ఆర్టీసీ అధికారుల అలసత్వం వల్ల వాటికి సంబంధించిన పనులు పూర్తి కావడం లేదు. దీనివల్ల ఆయా ప్రదేశాల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిలబడాల్సిన దుస్థితిని ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు.

ఐదు షెల్టర్లు..రూ.15లక్షల నిధులు

రెండు పట్టణాల్లో ఐదు చోట్ల షెల్టర్లను నిర్మించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో నాలుగు, కోరుట్లలో ఒక చోట ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఒక్కో షెల్టర్ నిర్మాణానికి రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షలు మంజూరు చేసింది. అయితే ఈ పనులకు ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు టెండర్లను నిర్వహించగా, హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ వీటిని దక్కించుకున్నారు. అనంతరం షెల్టర్లకు సంబంధించిన సామగ్రిని ఆయా డిపోలకు చేరవేశారు. కానీ పనులను మాత్రం ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం గమనార్హం.

ప్రయాణికులకు తప్పని తిప్పలు

మెట్‌పల్లిలో పాత బస్టాండ్, వెల్లుల్ల రోడ్, డిపో చౌరస్తా, వేంపేట రోడ్ ప్రాంతాలను షెల్టర్ల ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాలు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. షెల్టర్లు లేకపోవడంతో అక్కడ గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితులు ఉండడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని షెల్టర్ల కోసం నిధులను మంజూరు చేస్తే, అధికారుల తీరుతో ఏళ్లు గడుస్తున్నా అవి ఏర్పాటుకు నోచుకోవడం లేదు. అయితే ఆయా ప్రదేశాల్లో స్థలాలను గుర్తించకపోవడం వల్లనే కాంట్రాక్టర్‌కు పనులు చేయడం సాధ్యం కాలేదని తెలిసింది. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని షెల్టర్లు ఏర్పాటు చేసేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్ల ఏర్పాటుపై దృష్టి

మేనేజర్‌గా ఇటీవలనే బాధ్యతలు తీసుకున్నాను. షెల్టర్ల ఏర్పాటుకు సంబంధించిన సమాచారం తెలియదు. పూర్తి వివరాలు తెలుసుకుని వాటి ఏర్పాటుపై దృష్టి సారిస్తాను.

– మాధురి, డిపో మేనేజర్, కోరుట్ల

వరద కాల్వ మరమ్మతుకు కృషి



వరదకాల్వను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: గతంలో కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న వరదకాల్వ మరమ్మతులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట శివారులో దెబ్బతిన్న వరదకాల్వ కట్టను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరమ్మతులు చేపట్టేందుకు గతంలో అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేవన్నారు. ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి త్వరగా నిధుల కేటాయింపు జరిగేలా చూస్తానని పలుచోట్ల రైతులకు నీరందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో డీఈ అరుణ్, కాంగ్రెస్ పార్టీ మెట్‌పల్లి మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు లింగం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం వేణుగోపాల్ జువ్వాడి నర్సింగరావు సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని సర్పంచుల సమావేశంలో చెప్పటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. శీలం వేణు గోపాల్‌తో పాటు ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు పీసరి అశోక్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ తిరుమల గంగాధర్ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మచ్చ కవిత, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కృషి చేస్తాం

మల్లాపూర్: ప్రజాప్రభుత్వంతో సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాడని జువ్వాడి నర్సింగరావు అన్నారు. మల్లాపూర్ సొసైటీ చైర్మన్ గొండ రాజేందర్ ఆధ్వర్యంలో రత్నాపూర్ మాజీ సర్పంచ్ గొండ సుజాత, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎల్లాల జలపతిరెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేత బుగ్గారం

కథలాపూర్: ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కథలాపూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా బుగ్గారం జట్టు నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాయికల్ పై బుగ్గారం గెలుపొందింది. విజేతగా నిలిచిన బుగ్గారం జట్టుకు రూ. 20 వేల నగదు, జ్ఞాపికలు, రన్నరప్‌గా నిలిచిన రాయికల్ జట్టుకు రూ. 10 వేల నగదు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొండ ప్రవీణ్, మండలాధ్యక్షుడు అందె గోవర్ధన్, వివిధ మండలాల ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాయికల్: పట్టణానికి చెందిన న్యాయవాది అల్లె పురుషోత్తం, వనిత దంపతుల కుమారుడు విశ్వక్ సేన్ పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యుడు భూక్య గంగాధర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా సాంస్కృతిక దినోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ధర్మపురి: పట్టణంలో క్రీడా సాంస్కృతిక దినోత్సవంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక పాత టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ దినేశ్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్లు శ్రీనివాస్, కౌన్సిలర్ సంతోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానించిన తల్లిదండ్రులు

జగిత్యాల: ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని చైతన్య టెక్నో పాఠశాల ప్రిన్సిపల్ సచిన్ అన్నారు. 2022–23 సంవత్సరంలో 10 జీపీఏ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులను వారు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఒక విద్యార్థి ఏ స్థాయికి చేరినా, ఒక ఉపాధ్యాయుడే కారణమన్నారు. కార్యక్రమంలో ఏజీఎం రాజు, కో–ఆర్డినేటర్ శివకోటేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

జగిత్యాల:బీజేపీ మత రాజకీయాలను తిప్పికొట్టాలని, వచ్చేనెల 16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. టీఆర్‌నగర్ కార్యాలయంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందన్నారు. కార్యక్రమంలో వెంకటచారి, శేఖర్,

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్

గొల్లపల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయుడు అంబాజీ నాయక్ సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని ఇస్రాజ్‌పల్లిలో 8 ఏళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్తున్న అంబాజీ నాయక్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిర్ర గంగాధర్, ఉప సర్పంచ్ వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు నిషాంత్‌రెడ్డి, ఎంఈవో జమునాదేవి,జెడ్పీటీసీ జలేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్: మండలంలోని రంగపేట గ్రామ శివారుల్లో సోమవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఒడ్డెరకాలనీ నుంచి ఇసుక తరలిస్తుండగా రంగపేట శివారుల్లో పట్టుకుని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

30న పశువైద్య కళాశాలలో పశువుల వేలం

కోరుట్లటౌన్: పీవీ.నరసింహారావు పశువైద్య కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు పశువుల వేలం వేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంగోలు జాతి మగ దూడ ఒకటి, మహబూబ్‌నగర్ మేక పోతులు రెండు, లార్జ్ వైట్‌యార్క్ షైర్ మగ పందులు నాలుగింటిని వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరావత్తు సొమ్ము రూ.2 వేలు చెల్లించి, వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. నియమనిబంధనలకు అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్, పశుగణ క్షేత్ర సముదాయం, పశువైద్య కళాశాల కోరుట్లలో సంప్రదించాలని కోరారు.

కమిటీ ఏర్పాటుపై హర్షం

మెట్‌పల్లిరూరల్: నిజాం చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సిఫార్సు కమిటీ ఏర్పాటు చేయడం హర్షనీయమని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు.ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీ పునఃరుద్ధరణపై కమిటీ వేయడం శుభపరిణామమన్నారు.ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభిస్తే ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

రైతులు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

కథలాపూర్: వ్యవసాయ మోటార్లకు రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ డీఈ రవీందర్ అన్నారు. కథలాపూర్ శివారులో సిస్టం స్ట్రెంథనింగ్ కార్యక్రమంలో భాగంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్, వైర్లు బిగించి వాటిని సోమవారం ప్రారంభించారు. ఓవర్‌లోడ్ ఉన్న ఏరియాలో ఎక్కువ కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుని ట్రాన్స్‌కోకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ రాజబ్రహ్మాచారీ, ఏఈలు జమీల్‌పాషా, రాకేశ్‌కుమార్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మల్లాపూర్: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తామని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్ రావు అన్నారు. మండలంలోని రేగుంటలో ఇటీవల తార చందు అనే యువకుడు మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మండల అధ్యక్షుడు రొద్ద రాజు, నాయకులు బద్దం అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



యువకులకు బ్యాట్లు అందిస్తున్న ఎస్సై

మల్యాల: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, సమష్టిగా ఆడితే విజయం తథ్యమని ఎస్సై తీగల అశోక్ అన్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మల్యాలలో వన్ క్రికెట్ లీగ్‌ను సోమవారం ఎస్సై ప్రారంభించారు. పోటీల్లో 45 టీంలు పాల్గొంటున్నాయని, విన్నర్‌కు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు నగదు బహుమతి అందిస్తామని కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెల్మ లక్ష్మారెడ్డి, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యువకులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ధర్మపురి: హెల్మెట్ లేకుండా, నంబర్ లేని వాహనాలు నడిపిన వాహనదారులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని ధర్మపురి సీఐ రామనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలో సోమవారం సీఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి వాహనాల తనిఖీ చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు దత్తాత్రి, రామకృష్ణ సిబ్బంది ఉన్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాల సీజ్

ఇబ్రహీంపట్నం: నెంబర్ ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నెంబర్ ప్లేట్ లేని 15 ద్విచక్రవాహనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

సామాజిక అంశాలపై పోలీసుల అవగాహన



తుమ్మెనాలలో మాట్లాడుతున్న ఎస్సై

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాలలో సోమవారం రాత్రి ఎస్సై దత్తాత్రి ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని వాటిని అరికట్టడం కోసమే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు లేదా 100 డయల్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో లావణ్య

మల్లాపూర్: వరిసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. మండల కేంద్రంతో పాటు పాతదాంరాజుపల్లి, వాల్గొండ గ్రామాల్లో సోమవారం రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ యాసంగి వరిసాగులో కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, పిలకలు వేసే దశ, పూత, గింజ గట్టిపడే దశలో ఆశించి వరి పంటను తీవ్రంగా నష్టపరుస్తాయన్నారు. ఈ దశలల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపడితే ధాన్యంలో నాణ్యత పెరిగి తప్పు తాలు తగ్గి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు గజానంద్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

జగిత్యాలఅగ్రికల్చర్: వరినాట్ల సమయంలో పురుగులు, తెగుళ్ల రాకుండా రైతుల వ్యవసాయ క్షేత్రంలోనే వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సోమన్‌పల్లి, హబ్సీపూర్, కల్లెడ గ్రామాల్లో ఏఈవో సంధ్య సోమవారం రైతుల పొలాలను సందర్శించి తగు సూచనలు చేశారు. వరి నారుమడి సమయంలోనే వరి నాటేందుకు వారం రోజుల ముందు కార్బండిజమ్ గుళికలను ఇసుకతో కలిపి చల్లుకోవాలని, దీని వల్ల వరికాండం తొలుచు పురుగును నివారించవచ్చని సూచించారు.

సంక్షిప్త వార్తలు

పంచాయతీ భవనం ప్రారంభం

మేడిపల్లి: మండలంలోని విలయతబాద్‌లో నూతన నిర్మించిన పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం రాగోజీపేటలో గడ్డం రాఘవరెడ్డి అనే కాంగ్రెస్ నాయకుడు ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, చేపూరి నాగరాజు, శ్రీపతి దామోదర్, గంగారెడ్డి మధు, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలని వినతి

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామపంచాయతీల్లో నిధులు దారి మళ్లించారని వార్డు సభ్యులు భైరవేణి సత్యనారాయణ, పూదూరి రవి సోమవారం డీపీవోకు ఫిర్యాదు చేశారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో వైకుంఠధామం నిర్మాణం కోసం సర్పంచ్ 2020లో అడ్వాన్స్‌గా గ్రామపంచాయతీ నుంచి రెండు విడతలుగా రూ. 2.80 లక్షలు డ్రా చేశారని పేర్కొన్నారు. వైకుంఠధామం నిర్మాణం పూర్తి అవ్వడంతో వైకుంఠధామానికి ప్రభుత్వం పూర్తి బిల్లులు చెల్లించిందని తెలిపారు. ప్రభుత్వం నుండి వైకుంఠధామానికి బిల్లులు చెల్లింపులు జరిగిన తరువాత గ్రామపంచాయతీ నుంచి అడ్వాన్సుగా తీసుకున్న రూ. 2.80 లక్షలు తిరిగి గ్రామపంచాయతీకి జమ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు వీటిని జమ చేయలేదని వారు పేర్కొన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా పూర్తిస్థాయి విచారణ జరిపి గ్రామపంచాయతీకి నిధులు జమ చేసేలా చూడాలని కోరారు.

విద్యార్థులకు ఎస్సై అభినందన



విద్యార్థులతో ఎస్సై అజయ్

రాయికల్: పట్టణానికి చెందిన విద్యార్థులు మంచిర్యాలలో జరిగిన కరాటే కుంగ్‌ఫూ మార్షల్స్ ఆర్ట్స్ విభాగంలో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ఎస్సై అజయ్ అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బ్యాంక్‌ను సందర్శించిన విద్యార్థులు



యూనియన్ బ్యాంక్‌లో విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనలో భాగంగా సోమవారం యూనియన్ బ్యాంక్ సందర్శించి ఖాతాదారులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాన గోపికి అంబేడ్కర్ నేషనల్ అవార్డు

రాయికల్: మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన దళిత ఉద్యమకారుడు జాన గోపి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ సోమవారం ప్రకటించారు. ఫిబ్రవరి 11న తిరుపతిలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర చేసిన యువకులకు సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ అయోధ్యకు సైకిల్‌యాత్రగా వెళ్లి బాలరామున్ని దర్శనం చేసుకుని సోమవారం పట్టణానికి తిరిగి రాగా, హిందూ ధర్మసభ్యులు లింగ శ్రీనివాస్, సామల్ల సతీశ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ గన్నవరం గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడ, బ్రాహ్మణవాడ, హనుమాన్‌వాడ, శంకులపల్లి, బీరయ్యగుడి ప్రాంతం, కొత్తవాడ, వంజరివాడ, గంజ్‌వీధి, ఖాజీపుర, లడ్డు ఖాజా చౌరస్తా, టవర్‌సర్కిల్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.